# అసెంబ్లీ ఆవరణలో కూలిన భారీ చెట్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో భారీ చెట్టు నేలకొరిగింది. అసెంబ్లీ ఆవరణలో శ్రీను క్యాంటీన్ ముందున్న పెద్ద చెట్టు శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలింది. ఆ సమయంలో చెట్టు కింద ఉన్న ముగ్గురు వ్యక్తులు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. పార్క్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. అనంతరం అధికారులు చెట్టును తొలగించారు.

# ప్రజల ఐక్యతను దెబ్బతీసేలా కేంద్రం కుట్ర

- ఐక్యపోరాటాలతోనే హక్కుల్ని కాపాడుకోగలం : కె హేమలత
- వస్త్రాలపై జిఎస్‌టి రద్దు చేయాలి : చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే కుట్రకు మోడీ సర్కారు పూనుకున్నదని, దానికి భావోద్వేగపరమైన మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో ప్రజల్లో విద్వేషం నింపుతోందని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె హేమలత విమర్శించారు. దీన్ని తిప్పికొట్టేందుకు ఉత్పాదక రంగంలో అత్యంత కీలకమైన కార్మికులు, రైతులు ఒక్కతాటిపైకి వచ్చి పోరాటాలు చేయడం మంచి పరిణామం అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు, చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత హ్యాండ్‌లూమ్ (చేనేత) కార్మికుల కన్వెన్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణపతాకాన్ని ఎగురవేశారు. అనంతరం కన్వెన్షన్‌ను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోని పాలకులు దేశంలో వస్త్రమిల్లుల యజమానులకు లాభాలు గడించి పెట్టేందుకు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేస్తున్న తీరును వివరించారు. మోడీ సర్కారు వచ్చాక శాశ్వత పనివిధానం పోయి డైలీవేజ్, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పని పద్ధతుల అమలు వేగవంతం అయిందన్నారు. దీంతో యాజమాన్యాలు కార్మికులను అణచి ఉంచి పనిచేయించుకుంటున్నాయన్నారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చేనేత కార్మికులు పోషించిన పాత్రను వివరించారు. నేతన్నల హక్కుల కోసం చేనేత కార్మిక సంఘం చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను గుర్తుచేశారు. నేడు రాష్ట్రంలో అమలవుతున్న పింఛన్ స్కీమ్ చేనేత కార్మిక సంఘం పోరాట ఫలితమేనన్నారు. చేనేతపై జిఎస్‌టిని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. వస్త్ర తయారీ ముడిసరుకులను ప్రభుత్వమే సబ్సిడీ మీద అందించాలని కోరారు. రాష్ట్రంలో మగ్గమున్న ప్రతి కార్మికునికీ రూ.పది లక్షల చేనేత బంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు మాట్లాడుతూ..ప్రతి కార్మికునికీ రూ.పది వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేనేత వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 73 షెడ్యూల్ పరిశ్రమల్లో చేనేత రంగమూ ఉందనీ, కనీస వేతనాల జిఒలను వెంటనే విడుదల చేసి నేతన్నలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జాతీయ కార్యదర్శి కరిమలయన్, జాతీయ నాయకులు ఆర్ సింగారవేలు, ఎ బాలన్, బాలకృష్ణ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు శాంతికుమార్, సలహాదారులు కూరపాటి రమేశ్, సంఘం మాజీ నాయకులు శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల దోపిడీ : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రయివేట్ మెడికల్ కాలేజీల్లో వసూలు చేస్తున్న అదనపు ఫీజుల దోపిడీని అరికట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ మెడికల్ కాలేజీల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచి విద్యార్థులపై భారం మోపడం సరైంది కాదని విమర్శించారు. బి కేటగిరిలో సీట్లు పొందిన విద్యార్థులను ప్రయివేట్ మెడికల్ కళాశాలల యాజమాన్యాలు రకరకాల కారణాల పేరుతో ఫీజులు కట్టాల్సిందేనంటూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం తగదని హెచ్చరించారు. ఆ కాలేజీల్లో ప్రవేశం పొందిన యాజమాన్య కోటా విద్యార్థులను ప్రవేశాల సమయంలోనే రూ.12 లక్షల బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని, లేకుంటే చేర్చుకోమని చెప్పడం ద్వారా వందలాదిమంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిఒ నెంబర్ 126, 127 ప్రకారం ప్రయివేట్ మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన నెల రోజుల తర్వాత బ్యాంకు హామీని సమర్పించవచ్చని తెలిపారు. ఈలోపు విద్యార్థుల ప్రవేశాలను ఆపకూడదంటూ జిఒలో స్పష్టంగా ఉందని వివరించారు.

# గీత కార్మికుల్ని మోసం చేస్తే ఖబడ్దార్

- హామీల అమలులో నిర్లక్ష్యం తగదు
- వాగ్దానాలు అమలు చేయకపోతే.. ఎన్నికల్లో సత్తాచాటుతాం
- కల్లుగీత కార్మిక సంఘం మహాధర్నాలో వక్తల హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గీత కార్మికులంటే అంత చులకనా? వారి బతుకు బాధలు పట్టవా? ఇచ్చిన వాగ్దానాలు ఎందుకు అమలు చేయటం లేదు? ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి వందల మంది చనిపోతుంటే.. ఈ సర్కారుకు పట్టదా? సమస్యలు పరిష్కరిస్తామటూ నమ్మించి మోసం చేస్తే ఖబడ్దార్.. అంటూ వక్తలు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలలనుంచి వేలాదిగా కల్లుగీత కార్మికులు తరలి వచ్చారు. కల్లుముంతలు, తాటికమ్మలు, మోకు ముస్తాదుతో.. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఫ్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ మాట్లాడుతూ గీత కార్మికులకు ఇచ్చిన హామీల విషయంలో బిఆర్ఎస్ సర్కార్ తీరు 'నోటితో దీవించి నొసటితో వెక్కిరించిన' చందంగా ఉందని విమర్శించారు. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ అధ్వర్యంలో జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి కెటిఆర్ గీతన్నలపై వరాల జల్లు కురిపించారని గుర్తు చేశారు. వృత్తిలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామనీ, ద్విచక్ర వాహనాలు ఇస్తామనీ, లిక్కర్ షాపుల్లో గౌడలకు ఇచ్చే 15 శాతం రిజర్వేషన్లు సొసైటీలకు ఇస్తామనీ, గీతన్న బీమా పథకం అమలు చేస్తామంటూ హామీ ఇవ్వలేదా? అని ప్రశ్నించారు. వాటిని ఎందుకు అమలు చేయటం లేదో కార్మికులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంక్షేమానికి రూ. 100 కోట్లు కేటాయించామని గొప్పలకు పోయి.. బడ్జెట్ పత్రంలో మాత్రం రూ.30 కోట్లు మాత్రమే చూపించారన్నారు. ఇది గీత కార్మికులను మోసం చేయటం కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో గీత కార్మికుల బతుకులకు భరోసా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు 18 డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో గీతకార్మిక సొసైటీలకు అప్పటి ప్రభుత్వాలు ఇచ్చిన భూములకు రక్షణ లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్టర్ల కన్ను పడటంతో అవి అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఆయా సొసైటీల పరిధిలో ఉన్న భూములకు ప్రభుత్వమే రక్షణ కోసం కంచెలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లూరి గోవిందు, వి.వెంకటనర్సయ్య, గౌని వెంకన్న, బాల్నె వెంకట మల్లయ్య, బాలగాని జయరాములు, కార్యదర్శులు యస్.రమేష్ గౌడ్, చౌగాని సీతరాములు, బూడిద గోపి, బండకింది అరుణ్, గాలి అంజయ్య తదితరులు మాట్లాడారు.

## జెమినీ వైరస్‌తో.. మిర్చి రైతుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల వ్యాప్తంగా మిర్చి రైతులు జెమినీ వైరస్ (బొబ్బర తెగుళ్ళ)తో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పగిడిపల్లి శివారు బాబోజీ తండాకు చెందిన బానోత్ రాముడు తన రెండు ఎకరాల మిర్చి పంటకు జెమినీ వైరస్ సోకింది. దాంతో ఎన్ని రకాల క్రిమిసంహారక మందులు వాడినా.. మిర్చి మొక్కలు ఎండిపోతున్నాయని తన ఆవేదనను విలేకరులతో వెల్లబుచ్చుకున్నారు. వైరస్ ప్రభావంతో ఆకు వంకరగా చుట్టుకుపోవడం, ముడతలు పడటం, మొక్కలు ఎండి పోతున్నాయని తెలిపారు. బాబోజీ తండాలోనే సుమారుగా 150 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారని, ఇప్పటివరకు ఒక ఎకరానికి రూ.50వేలు చొప్పున పెట్టుబడులు పెట్టామన్నారు. వైరస్ సోకి పూర్తిగా ఎండిపోయిన మిర్చి పంటను రైతులు ట్రాక్టర్లతో దున్నీ తొలగిస్తున్నారని తెలిపారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అవగాహన కల్పించాలని యువ రైతులు నరేష్, లక్‌పతి తదితరులు కోరుతున్నారు.

# అధ్వానంగా పారిశుద్ధ్యం

- మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మురికి కాలువలోకి దిగి నిరసన చేస్తున్న జూలకంటి

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, మురుగు కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి ఉన్నాయని, ప్రజలు అవస్థలు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద శుక్రవారం మురుగు కాలువను ఆయన పరిశీలించారు. చెత్తాచెదారంతో నిండిన కాలువలో దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. పట్టణంలోని గాంధీనగర్, సీతారాంపురం, షాబునగర్, ముత్తిరెడ్డి కుంట హనుమాన్‌పేట మురికి కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోందన్నారు. జనావాసాల్లోని కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు.

వర్షం వచ్చినప్పుడల్లా కాలువలో నీరు నిల్వ ఉంటుందన్నారు. ఎన్నికలపై దృష్టి తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. తక్షణమే మురికి కాలువల్లో చెత్తను తొలగించాలని, మురుగు నీరు సక్రమంగా వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమిడాల పరుశురాములు, ఎండి అంజాద్ పాల్గొన్నారు.

# అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరవేయాలి

- బాధ్యతగా వ్యవహరిద్దాం
- జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట
- సమాచార శాఖ సమీక్షలో మంత్రి మహేందర్ రెడ్డి

సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కొత్తగా ఏర్పడిన తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వ అభివద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని ప్రజలకు బాధ్యతగా తెలియజేయాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గనుల శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సచివాలయంలో శుక్రవారం సమాచార, పౌర సంబంధాల శాఖపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సమాచార శాఖ ప్రత్యేక కమీషనర్ కె అశోక్‌రెడ్డి, డైరెక్టర్ బి రాజమౌళి, అన్ని జిల్లాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎక్కువ పనిచేసి తక్కువ చూపిస్తున్నామని చెప్పారు. రాష్ట్రం అన్ని రంగాలలో సాధిస్తున్న ప్రగతితోపాటు మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కుటుంబ, రైతు సంక్షేమ పథకాలు లాంటి వాటికి, బతుకమ్మ సంబరాలు వినాయక చవితి, శ్రీరామ నవమి, జాతరలు, మహనీయుల చారిత్రక వారసత్వ అంశాలతో పాటు ఉత్సవాలు, రంజాన్, క్రిస్మస్ పండుగ సందర్భంగా చేపడుతున్న కార్యక్రమాలను సామాజిక చైతన్యం కోసం మరింత ఎక్కువగా ప్రచారం చేయాల్సిన అవసరముందని వ్యాఖ్యానించారు. సమాచార శాఖలో ఖాళీలుగా ఉన్న వివిధ స్థాయిలోని 361 పోస్టులను త్వరలో భర్తీ కోసం సిఎం కెసిఆర్‌కు నివేదిస్తామన్నారు. సమాచార శాఖ బలోపేతానికి అవసరమైన అధునాతన కెమెరాలు, వీడియో కెమెరాలతో పాటు సిబ్బందికి వాహనాలు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. సోషల్ మీడియా సమాజంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో సమాచార, పౌర సంబంధాల శాఖ సోషల్ మీడియాలో తన పాత్రను మరింత పెంచుకోవాలని చెప్పారు.

**జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట**

తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి సిఎం కెసిఆర్ పెద్దపీట వేస్తున్నారని మంత్రి మహేందర్ రెడ్డి అన్నారు. సిఎం కెసిఆర్ రూ. వంద కోట్లు జర్నలిస్టుల సంక్షేమం కోసం అందించడం జరిగిందన్నారు. కరోనా బాధితులు, ప్రమాద బాధితులు తదితర 479 జర్నలిస్టు కుటుంబాలకు రూ. 6.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. 136 మంది జర్నలిస్టులకు ఆర్థిక సహాయంగా ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున రూ. 68 లక్షలు అందించామని వివరించారు. దేశంలోనే రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా 22,686 జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. జర్నలిస్టుల పిల్లల చదువుల కోసం నెలకు రూ.1000 చొప్పున రూ. 74 లక్షల 37 వేలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. జర్నలిస్టుల కోసం రూ. 15 కోట్లతో నిర్మించిన మీడియా అకాడమీ భవనం పూర్తయ్యిందనీ, త్వరలోనే సిఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామని వివరించారు. భవనంలో ఆధునిక సదుపాయాల కోసం మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మరింత డబ్బు అడిగారని, మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలలో జర్నలిస్టులకు ప్రెస్‌క్లబ్‌లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

# కారులో ఆ స్పీడేదీ..?

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కారు.. సారు.. సర్కారు... మొన్నటిదాకా బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు ఉత్సాహాన్నీ, ఊపునూ ఇచ్చిన నినాదమిది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వంద సీట్లలో పక్కాగా గెలవటం ద్వారా తమ పార్టీ మూడోసారి జెట్ స్పీడుతో దూసుకెళుతుందంటూ గులాబీ నేతలు చెప్పుకుంటూ వచ్చారు. ఈ క్రమంలోనే సిఎం కెసిఆర్ ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి మూణ్నెల్ల ముందుగానే 115 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. దాంతో జనం వద్దకు వెళ్లేందుకు, ఎన్నికల ప్రచారాన్ని షురూ చేసేందుకు సుదీర్ఘ సమయముందని బిఆర్ఎస్ వర్గాలు భావించాయి. తద్వారా ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళంలో పడతాయని ఆయా వర్గాలు అంచనా వేశాయి. ఇది జరిగి సరిగ్గా నెల (ఆగస్టు 21న జాబితాను విడుదల చేశారు) దాటింది. కానీ ముందుగా అంచనా వేసినట్టు గులాబీ పార్టీలో మాత్రం ఆ జోష్ కానరావటం లేదు. ఒకవైపు ప్రతిపక్ష కాంగ్రెస్ సిడబ్ల్యుసి సమావేశాలు, బహిరంగ సభలు, చేరికలతో హడావుడిని సృష్టిస్తోంది. మరోవైపు బిజెపి సైతం అమిత్ షా లాంటి జాతీయ నేతలతో పబ్లిక్ మీటింగులను నిర్వహించి హల్‌చల్ చేసినట్టు చెప్పుకుంటోంది. కానీ పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ మాత్రం సొంత అభ్యర్థుల్లో ఆ స్పీడు లేక వెలవెలబోతోంది. తొలి జాబితా తర్వాత కారు సారు రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేస్తూ రాజకీయ వాతావరణాన్ని హీటెక్కిస్తారని అందరూ అంచనా వేశారు. అందుకు భిన్నంగా ఒకట్రెండు సందర్భాల్లో తప్ప సిఎం జిల్లాలకు వెళ్లిన దాఖలాల్లేవు. మూణ్నెల్ల ముందే జాబితాను ప్రకటించటంతో అన్ని నెలలపాటు కార్యక్రమాల నిర్వహణ తలకు మించిన భారమవటం ఎమ్మెల్యేలు, అభ్యర్థుల్లో నైరాశ్యానికి ఒక కారణమైతే... అంతకు మించిన ప్రధాన కారణం మరొకటి ఉందనే ప్రచారం బిఆర్ఎస్‌లో జోరుగా కొనసాగుతోంది. టిక్కెట్ దక్కిందని మురిసిపోతున్న వారెవ్వరికీ బీ-ఫామ్ వస్తుందన్న గ్యారెంటీ లేకపోవటమే అసలు సిసలు కారణమని తెలిసింది. అందుకే ఇప్పటి నుంచే తొందరపడకుండా, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత, బీ-ఫామ్ చేతికందిన తర్వాతే ప్రచారాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు.

**'పథకాలతో' పరేషాన్...**

ఈ విషయాన్ని పసిగట్టిన కెసిఆర్... 'జనంలో ఉండండి..' అంటూ తాజాగా వారందరికీ వార్నింగ్ ఇచ్చినట్టు వినికిడి. అలా ఆయన ఆదేశాలు జారీ చేసినా అభ్యర్థులు నిర్భయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లలేని పరిస్థితి. సర్కారు ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన దళిత బంధు పథకం, ఎన్నికల కోసం ముందుకు తెచ్చిన బిసి, మైనారిటీ బంధు పథకాలు వారికి మెడకు చుట్టుకుంటున్నాయి. దళిత బంధు మొదటి దశ పూర్తయిందని చెబుతోన్న ప్రభుత్వం.. ఆ పథకం రెండో దశను ప్రారంభించింది. ఎమ్మెల్యేలు లబ్దిదారుల ఎంపికను పూర్తి చేసి, పైకి పంపినా ఇంకా గ్రౌండింగ్ పూర్తి కాకపోవటంతో దానిపై లబ్దిదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. బిసి, మైనారిటీ బంధు పథకాలకు సంబంధించి కూడా ప్రజలు ఎక్కడికక్కడ ప్రజా ప్రతినిధులను నిలేస్తున్నారు.

**అప్పుడలా.. ఇప్పు'డీలా...'**

ఈ పరిణామాలన్నింటి రీత్యా గులాబీ పార్టీ అభ్యర్థుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది. 2018లో ఒక ఏడాది ముందుగానే ముందస్తు ఎన్నికలకు వెళ్లిన బీఆర్ఎస్ బాస్...ఆక్రమంలో పార్టీలో, క్యాడర్‌లో జోష్‌ను పెంచి, రెండోసారి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు ముందస్తుకు వెళ్లకుండా నిర్ణీత సమయంలోనే ఎన్నికలకు వెళుతూ... మూణ్నెల్ల ముందుగానే అభ్యర్థులను ప్రకటించినా అప్పటి హుషారు ఇప్పుడు ఆ పార్టీలో, కార్యకర్తల్లో కానరాకపోవటం గమనార్హం.

# నేటి నుంచి ఇఎన్‌టి డాక్టర్ల రాష్ట్ర 8వ సదస్సు

- పాల్గొననున్న 33 జిల్లాల నుంచి 500 మంది వైద్యులు : శేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెవి, ముక్కు, గొంతు విభాగం డాక్టర్ల రాష్ట్ర స్థాయి సదస్సు తొలిసారి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఎఒఐటిఎస్ సౌత్ జోన్ ప్రెసిడెంట్, సదస్సు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీలోని శేఖర్‌రెడ్డి ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌పి కన్వెన్షన్ ఎసి హాల్లో 23న ఉదయం పది గంటలకు సదస్సును తెలంగాణ శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ తిరునగర్ భార్గవ్ ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర సదస్సు రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామని, మిర్యాలగూడ పట్టణంలో తొలిసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 33 జిల్లాల నుంచి సుమారు 500 మంది డాక్టర్లు హాజరవుతున్నట్టు తెలిపారు. డాక్టర్లతోపాటు ఇఎన్‌టిపిజి మెడిసిన్ చదివే విద్యార్థులు విధిగా ఈ సదస్సుకు హాజరై ఏదైనా ఒక సబ్జెక్టు గురించి సమగ్ర వివరాలతో వైద్య నిపుణుల సమక్షంలో ప్రజెంటేషన్ ఇస్తారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో రాష్ట్ర సదస్సులు జరిగాయని చెప్పారు. వైద్య విభాగానికి చెందిన ప్రముఖ ప్రొఫెసర్లు, హెచ్‌ఓడిలు సైతం హాజరు కానున్నారని తెలిపారు. వైద్య రంగంలో నూతనంగా వచ్చే పరికరాలు, ఆపరేషన్లు, టెక్నాలజీ గురించి చర్చిస్తారన్నారు. జూనియర్ డాక్టర్లు కొత్త అంశాలు తెలుసుకోవడానికి వేదికగా ఇలాంటి కాన్ఫరెన్స్‌లు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అత్యాధునిక పరికరాలతో నూతన టెక్నాలజీతో కూడిన అంశాలను పరీక్షించేందుకు మిర్యాలగూడ ఈఎన్టీ హాస్పిటల్ నుంచి లైవ్‌లో ఇఎన్‌టి వైద్య నిపుణుల సమక్షంలో ఆపరేషన్ చేస్తారని చెప్పారు. సదస్సులో పాల్గొనే డాక్టర్లు, పీజీ విద్యార్థులు ఆపరేషన్ చేసే విధానాన్ని పరిశీలించనున్నట్టు తెలిపారు. వివిధ అంశాలపై ఉత్తమ ప్రజెంటేషన్ ఇచ్చిన 15 మంది డాక్టర్లకు గోల్డ్ మెడల్స్ అందజేయనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్లు రాకేష్, నాగవర్ధన్ రెడ్డి, వంశీ ఉన్నారు.

## గోడకూలి ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హన్మకొండ జిల్లా శాయంపేట గ్రామంలోని పోచమ్మ వీధిలో శిథిలావస్థలో ఉన్న ఇంటి గోడ కూలి ముగ్గురు కూలీలు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట గ్రామానికి చెందిన ముష్కే భాగ్యలక్ష్మి భర్త సురేష్.. కొంతకాలం కిందట గుండెపోటుతో మరణించారు. ఆమె ఇల్లు శిథిలావస్థకు చేరుకొని పైకొప్పు మొత్తం కూలిపోయింది. దాని పక్కనే చిన్న రేకుల షెడ్డు వేసుకొని కిరాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు గోడ పూర్తిగా నానిపోయింది. దాంతో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఒక్కసారిగా కూలి.. రోడ్డుపై వెళ్తున్న వారిపై పడింది. ఈ క్రమంలో లోకలబోయిన సారలక్ష్మి(55), మోరే సాంబయ్య (65)పై గోడ పడడంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. గోడ పక్కనే ఆటోలో బియ్యం వేస్తున్న భోగి జోగమ్మపై గోడ మట్టిపెల్లలు పడటంతో నడుం, కాళ్లు విరిగిపోయాయి. అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో మార్గమధ్యలోనే జోగమ్మ మృతి మృతిచెందారు. ఎస్ఐ దేవేందర్ సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. తహశీల్దార్ సుభాషిణి, ఆర్ఐ శరత్‌కుమార్ సంఘటన వివరాలు సేకరించారు.

## అంగన్‌వాడీలు సమ్మె విరమించాలి

- మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అంగన్‌వాడీలకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహిళాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రెగ్యులర్ చేయాలనే డిమాండ్ కేంద్రం పరిధిలోనిదని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వారి తరుపున లేఖ రాస్తామని చెప్పారు. అవసరమైతే కేంద్ర మంత్రులను స్వయంగా కలుస్తామన్నారు. తక్షణం అందరూ విధులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలకు సంబంధించిన పలు అంశాలపై ప్రభుత్వం జిఒ విడుదల చేసిన తర్వాత వారు సమ్మెను కొనసాగించటమేంటని ప్రశ్నించారు.

**ఆర్డర్ 38 రూలు 5 సి.పి.సి నోటీసు. మహారాజశ్రీ బనగానపల్లి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**I.A.NO: 570/2023 in O.S.NO:178/2023**

తలారి వెంకట నాయుడు. ...పిటిషనర్/వాది
అక్కిరాజు శివ ప్రసాద్ పోతి వారసులు
అక్కిరాజు ఝాన్సీ
అక్కిరాజు అఖిల్
అక్కిరాజు అకాష్. ...రెస్పాండెంటు/ప్రతివాదులు

రెస్పాండెంట్స్:
1.అక్కిరాజు ఝాన్సీ, భర్త: లేట్ అక్కిరాజు శివ ప్రసాద్,
2.అక్కిరారు అకాష్ తండ్రి: లేట్ అక్కిరాజు శివ ప్రసాద్
3.అక్కిరాజు అఖిల్ తండ్రి లేట్ అక్కిరాజు శివ ప్రసాద్
All are R/o ప్లాట్ నెంబరు: 101 డా.డి.వి.సుబ్బారెడ్డి ఎన్లేవ్, స్టేట్ బ్యాంక్ ఎదురుగా, అశోక్ నగర్, హైదరాబాదు.

రెస్పాండెంట్లు/ ప్రతివాదులకు సివిల్ ప్రొసీజర్ కోడు ఆర్డరు XXXVIII రూలులు 5 ప్రకారము నోటీసులు

పై దావాలో కనబరిచిన పిటిషనర్ ఐన తలారి వెంకట నాయుడు గారు మీ తాలూకు స్థిరాస్తులను జప్తి కోరి పై కోర్టులో పిటిషను దాఖలు చేసి వున్నాడు కావున రెస్పాండెంట్లు ఐన మీరు 29-09- 2023 వ తేదీన ఉదయం 10-30గం. స్వయముగా గాని వకీలు ద్వారాగాని ఏదైన ఆక్షేపణలు వుంటే తెలుపుకోగలరు, లేనిపక్షములో పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి వుత్తరువు మేరకు)

వాయిదా తేదీ: 29-09-2023

సి.శ్రీనివాస మూర్తి,
యస్.షేక్షావలి,
అడ్వకేట్స్,
ఫిటిశనర్/వాది తరుపు న్యాయవాదులు,
1-66, యన్.జీ.వో కాలనీ,
బనగానపల్లె, నంద్యాల జిల్లా.
Cell No:9885040113.

**మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**O.S.No. 38/2023**

పందీటి వాసవిదేవి వగైరాలు .....వాదులు
వర్సెస్
పందీటి అశోక్‌కుమార్ వగైరాలు ...ప్రతివాదులు

TO
D8 : పందీటి స్వాతి భర్త చేబ్రోలు విష్ణు తండ్రి లేట్ పందీటి వెంకటరమణ, 32 సం.లు. హిందు, గృహిణి, డో.నెం. 8-5-91/1బి, రోడ్డు నెం.1, మల్లిఖార్జునకాలనీ, పాతబోయినపల్లి హైదరాబాద్ -500011, తెలంగాణా రాష్ట్రం

పై నెంబరు దావాలోని వాదులు దావా షెడ్యూలు ఆస్థులలో వారికి వుంటున్న భాగమును రాగోరి భాగపంపిణీ వగైరా పరిహారములు పొందగోరి దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో నీకేమైన ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేది 12-10-2023న ఉదయం గం.10.30 ని.లకు స్వయంగా గాని లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై, నీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో నీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

శ్రీ యస్.వి.నాగేంద్రబాబు
వాదిపరం అడ్వకేట్,
గిద్దలూరు.
స్థలం : గిద్దలూరు,
తేది : 23-09-2023

## విద్యార్థులపై పోలీసుల దాడి అమానుషం : ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు దాడి చేయటం అమానుషమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అరుణజ్యోతి, మల్లు లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పెద్దపల్లి జిల్లా బాలికల జూనియర్ కాలేజీ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు కోసం భూమి పూజ చేయొద్దంటూ నిరసన తెలియజేసిన విద్యార్థినీలు, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని తెలిపారు. వారిని అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఈ ఘటన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించటమేనని తెలిపారు. మరొక ప్రాంతంలో లైబ్రరీ ఏర్పాటు చేయాలని విద్యార్థినులందరూ చెప్పినా వినకుండా స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మంత్రి కొప్పుల ఈశ్వర్ సాక్షిగా ఈ దాడి జరగడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థినీలపై స్టేషన్‌లో విచక్షణారహితంగా దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నగరంలో బెస్ట్ అగ్రోలైఫ్ కార్యాలయం ఏర్పాటు

హైదరాబాద్ : అగ్రోకెమికల్ ఉత్పత్తుల తయారీ సంస్థ బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ హైదరాబాద్‌లో తమ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. కొండాపూర్‌లోని ఏషియన్ సన్‌సిటీలో నూతన ఆఫీసును తెరిచినట్లు తెలిపింది. కంపెనీ దక్షిణాది వ్యాపారానికి హైదరాబాద్ కేంద్రంగా ఉందని పేర్కొంది. దేశంలోని మొత్తం వ్యవసాయ రసాయన వ్యాపారంలో దక్షిణాది 35 శాతం వాటాను కలిగి ఉందని.. తమ వ్యూహాత్మక కార్యక్రమాలలో కొత్త కార్యాలయం కీలక పాత్ర పోషించనుందని ఆ సంస్థ పేర్కొంది.

## జిఒ 142 అభ్యంతరాలపై ఉన్నతస్థాయి కమిటీ

- టిపిహెచ్‌డిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజారోగ్య విభాగంలో రీఆర్గనైజేషన్ జిఒ 142పై ఉన్న అభ్యంతరాలపైన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఆదేశించినట్టు తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ (టిపిహెచ్‌డిఎ) తెలిపింది. మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం సమర్పించిన అనంతరం టిపిహెచ్‌డిఎ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కత్తి జనార్ధన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణచందర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర డిమాండ్ల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

## ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్, ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా ఆదనపు పిసిసిఎఫ్ డాక్టర్ వినయ్ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ (ఇంటర్నేషనల్ కో ఆపరేషన్)గా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ వినయ్‌కుమార్ నియమితులయ్యారు. ఆయన ఐదేళ్లపాటు ఈ పదవిలో ఉండనున్నారు. ఫారెస్ట్ రీసెర్చ్, ఎడ్యుకేషన్‌పై అంతర్జాతీయ సంబంధాలను సమన్వయం చేయనున్నారు. వివిధ దేశాలకు చెందిన సంస్థల అటవీ అధ్యయనం, పరిశోధనలు, పర్యావరణ మార్పులపై జరిగే సదస్సులను వినయ్ కుమార్ పర్యవేక్షిస్తారు. ఆయన ప్రస్తుతం తెలంగాణ అటవీ శాఖలో అదనపు పిసిసిఎఫ్ హోదాలో ఐటి, వర్కింగ్ ప్లాన్ బాధ్యతలను నిర్వహిస్తున్న విషయం విదితమే

## తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో వర్క్‌షాపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అటవీ సంరక్షణ, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల మధ్య సమతుల్యత అనే అంశంపై అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. తెలంగాణ అటవీ దళాల అధిపతి ఆర్ఎం డోబ్రియల్ దీన్ని ప్రారంభించారు. జీవవైవిధ్య సంస్థ సంచాలకులు ఇ వెంకట్‌రెడ్డి ఇతర రాష్ట్రాల అధికారులకు స్వాగతం పలికారు. ముఖ్య అతిథి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రమేశ్ పాండే మాట్లాడుతూ.. అటవీ సంరక్షణ చట్టానికి నియమ నిబంధనలు రూపొందించేందుకు ఈ వర్క్‌షాపు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పిసిసిఎఫ్ డోబ్రియల్ మాట్లాడుతూ.. అటవీ సంరక్షణ చట్టం-1980ని ఇటీవల సవరించిన నేపథ్యంలో కొత్తగా చట్టం అమలులో ఈ వర్క్‌షాపు దోహపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అటవీ శాఖ ప్రాంతీయ కార్యాలయం(బెంగుళూరు) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పి.సుబ్రమణ్యం మాట్లాడుతూ.. సవరించిన అటవీ సంరక్షణ చట్టం పట్ల ఉన్న అపోహలను తొలగించడానికి ఈ కార్యశాల ఉపయోగపడుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల అధికారులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో న్యాయ నిపుణులు డీవీఎన్ మూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ప్రాంతీయ కార్యాలయం(బెంగుళూరు) డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎంకే శంభు సాంకేతిక అంశాలపై ప్రసంగించారు. అటవీ జీవ వైవిధ్య సంస్థ అధికారి సందీప్ ప్రాటీ వందన సమర్పణ చేశారు. ఈ వర్క్‌షాపులో అన్ని జిల్లాల అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మార్కెట్ గ్యారంటీకి చట్టాలు తేవాలే..!

- రుణవిమోచన చట్టంతో రైతులను ఆదుకోవాలి
- దేశానికి తిండిపెట్టే అన్నదాతను పట్టించుకోని కేంద్రం
- పేదలను దోచి కార్పొరేట్లకు పెట్టే దిశగా చట్టాల రూపకల్పన
- రైతు ప్రయోజన చట్టాల కోసం నడుం బిగించాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్

సభలో మాట్లాడుతున్న టి సాగర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైతు పండించే ప్రతి పంటకూ మద్దతు ధర, గ్యారంటీ మార్కెట్ కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలి. కేరళ తరహా రైతు రుణవిమోచన, మద్దతు ధర కల్పించే చట్టాలను చేయాలి. పరిశ్రమల్లో ఉత్పత్తులకు ధర నిర్ణయించినట్టుగానే రైతు పండించే పంటలకూ రేటు నిర్ణయించే చట్టాన్ని తేవాలే.. కేంద్రంలోని బిజెపి సర్కారు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చే కుట్ర చేస్తోందని, దాన్ని తిప్పకొడుతూ ఢిల్లీ కేంద్రంగా సాగిన రైతాంగ పోరాట స్ఫూర్తితో రాష్ట్ర రైతాంగం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి' అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపునిచ్చారు.

తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో మూడ్రోజులు జరగనున్న రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముందుగా సంఘం జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వర్ణవెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో టి సాగర్ ప్రారంభోపన్యాసం చేశారు. రాష్ట్రంలో నీళ్ల, సరిపడా విద్యుత్ సౌకర్యంతో పెద్దఎత్తున వరి పండుతున్నా.. రైతాంగం నష్టాల నుంచి బయటపడే పరిస్థితి లేదన్నారు. కేంద్రం వరికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2060 ప్రకటించిందే తప్ప చట్టం చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తున్నప్పటికీ అది ఆలస్యమవుతుండటంతో ప్రయివేటు వ్యాపారులు, మిల్లర్లు రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుని క్వింటా ధాన్యానికి రూ.1600 నుంచి రూ.1700 కూడా చెల్లించకుండా కొంటున్నారని తెలిపారు. పైగా వరి తప్ప మిగతా పంటల సాగుకు ప్రభుత్వం దగ్గర ప్రణాళికలు లేవని, అందుకు కనీస ఆలోచనా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు వరిసాగుకే మొగ్గు చూపుతూ పెద్దఎత్తున వరి పండిస్తున్నా.. సరైన ధర గిట్టుబాటుకాక నష్టాల పాలవుతున్నారని వివరించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన పెట్టుబడి, పంటల కొనుగోలును పకడ్బందీగా నిర్వహించే వీలున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. పైగా వందశాతం రుణాలను గ్రామీణ ప్రాంత రైతులకే ఇచ్చే సహకార సంఘాలను నిర్వీర్యం చేసేలా కేంద్రంలోని బిజెపి సర్కారు మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సిస్టమ్ తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రత్యామ్నాయ పంటల్లేవ్.. ప్రభుత్వ సహకారమూ లేదు**

రాష్ట్రంలో 50 శాతానికిపైగా కాయగూరలు, పండ్లు ఇతర పంటలన్నీ ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయని సాగర్ తెలిపారు. రవాణా చార్జీలు, ఇతర ఖర్చులు కలుపుకొని ఇక్కడి జనాలు అధిక ధరలకు వాటిని కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కనీసం రాష్ట్ర ప్రజల అవసరాలకు అనుగుణంగా పప్పులు, నూనెగింజల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహించడం లేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో పత్తికి బదులు కందులు, పెసర్లు పండించాలని, ప్రభుత్వమే పది వేల క్వింటాళ్లు కొంటుందని నమ్మబలికి తీరా పెద్దఎత్తున పంట చేతికొచ్చాక కనీసం ఆరు వేల క్వింటాళ్లు కూడా కొనలేదని గుర్తు చేశారు. కనీసం కేరళను చూసైనా ప్రభుత్వం కండ్లు తెరవాలని సూచించారు. కేరళలో రైతు రుణ విమోచన చట్టం తీసుకొచ్చి రైతులను రుణ విముక్తులను చేశారని, కొత్త రుణాలు ఇస్తూ సాగు ప్రోత్సాహాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. అక్కడి ప్రభుత్వం 16 రకాల కాయగూరలకు మద్దతు ధర ప్రకటించి రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తూ క్వింటాల్ వరి ధాన్యంపై రూ.800 బోనస్ కూడా ఇస్తోందని తెలిపారు. ఇక్కడి ప్రభుత్వం మాత్రం రైతులు, వ్యసాయ కూలీలు, కౌలు రైతులు, చేతివృత్తిదారుల సమస్యల పరిష్కారానికి ఓ కమిటీ వేసి చేతులు దులుపుకుందని విమర్శించారు.

## ఫలించిన చర్చలు

- నిరసన కార్యక్రమాలు, మహాధర్నా వాయిదా : టివివిపి ఉద్యోగుల జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అతి తొందరలో వైద్యవిధాన పరిషత్‌ను ప్రభుత్వ సంస్థగా మార్చేందుకు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చినట్టు తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల జెఎసి తెలిపింది. శుక్రవారం టిఎస్ఎంఐడిసి ఛైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జెఎసి నాయకులు మంత్రి హరీశ్‌రావుతో చర్చించారు. మంత్రితో జరిపిన చర్చలు సఫలం కావడం, హరీశ్‌రావు సానుకూలంగా స్పందించడంతో నిరసన కార్యక్రమాలతో పాటు అక్టోబర్ 10న నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు. 317 జిఒ అమలుకు సహాయ, సహకారాలు అందిస్తామనీ, కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. పదోన్నతులు ఇవ్వడానికీ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెల నెల జీతాలిచ్చేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి భరోసా ఇచ్చారన్నారు. అదే విధంగా 23 డిసిహెచ్ఎస్ పోస్టులను నూతనంగా ఏర్పాటు చేయడంతోపాటు, నాలుగో తరగతి ఉద్యోగులకు ఇన్ సర్వీస్ ట్రైనింగ్ ఇచ్చి పదోన్నతులు ఇచ్చేందుకు మంత్రి అంగీకారం తెలిపారని వారు వివరించారు. మంత్రితో జరిగిన చర్చల్లో జెఎసి నాయకులు డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ రవూఫ్, నల్ల సోమ మల్లన్న, వట్టి మరియమ్మ, సత్యనారాయణ రెడ్డి, ఇందిరా శ్రీలక్ష్మి, భూలక్ష్మి, ఆదిలక్ష్మి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆదివాసీ, దళిత అంగన్‌వాడీలపై దాడి దారుణం

- పోలీసులపై తగు చర్యలు తీసుకోవాలి
- ఎస్‌సి, ఎస్‌టి, మహిళా కమిషన్లకు అంగన్‌వాడీ జెఎసి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ, దళిత మహిళ అంగనాన్‌వాడీ ఉద్యోగుల పైన పోలీసులు దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషించి, కొట్టి గాయపర్చడం దారుణమని, ఘటనకు కారకులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ జెఎసి, తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా సమన్వయ కమిటీ (సిఐటియు అనుబంధం)లు ఎస్‌సి, ఎస్‌టి, మహిళా కమిషన్‌లకు వేర్వేరుగా ఫిర్యాదు చేశాయి. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మెన్‌కు ఫిర్యాదు చేసిన వారిలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ జెఎసి నేతలు పి జయలక్ష్మి (సిఐటియు), ఎన్ కరుణ కుమారి (ఎఐటియుసి), సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కె ఈశ్వరరావులు ఉన్నారు. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన వారిలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్‌వి రమ, సభ్యులు ఎం మీనా, ఎ సునీత ఉన్నారు. ఆదివాసీ, దళిత మహిళలపై దాడి చేసిన ఎస్ఐ, సిఐ, డిఎస్‌పి తదితరుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పోలీసులే దాడి చేసి అంగన్‌వాడీలే తమను కొట్టారని తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని కమిషన్ల దృష్టికి తీసుకెళ్లారు. 'ఆదిలాబాద్‌లో ఈ నెల 20న కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు అంగన్‌వాడీలు వెళ్లగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. మగపోలీసులు వారి పట్ల దురుసుగా ప్రవర్తించారు. తలమడుగు ఎస్ఐ ధనశ్రీ ఆదివాసీ, దళిత అంగన్‌వాడీలను పట్టుకుని గోండు, కొలాం లం.., బొడ్లు ముండలు, కల్లుతాగి ఇక్కడికి వచ్చారు. రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారు అంటూ కులం పేరుతో దూషించారు. జుట్టు పట్టుకొని చీరలు ఊడిపోయేలా కొట్టారు. మిగిలిన పోలీసులు ఆమెను అనుసరించి చేతికి అందినవారిని అందినట్టు కొట్టారు. మగ పోలీసులు దుర్భాషలాడారు' అని వివరించారు. 'ఆ ఘటనలో మన్నూరు గ్రామానికి చెందిన కె సులోచన గొంతుకు గాయాలయ్యాయి. సైదుపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కనక ప్రగతి (ఎస్‌టి) పోలీసుల దెబ్బలకు స్పృహ తప్పి పడిపోయింది. మరో అంగన్‌వాడీ కార్యకర్త ప్రేమకుమారి (దళిత)ని ఎస్ఐ ధనశ్రీ జుట్టుపట్టుకుని కొట్టారు. నార్నూర్ గ్రామానికి చెందిన కె పంచశీల, గుంజాలకు చెందిన జి రేఖ ప్రధాన్, ఎ జైశీల, మార్వగూడకు చెందిన కె వత్సల, నడ్డగూడకు చెందిన టేకం సీతాబాయిలను పోలీసులు చెప్పలేని మాటలతో తిట్టారు. అంగన్‌వాడీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అయిన ధోనిపెల్లి వెంకటమ్మ, కామ సునీత, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అయిన డి సునీతలపై పోలీసులు దాడి చేశారు. వారి చీరలు లాగి అవమానపరిచారు. శాంతియుతంగా, చట్టబద్ధంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన అంగన్‌వాడీ కార్యకర్తలను కులం పేరుతో దూషిస్తూ, బట్టలు ఊడిపోయేలా కొట్టిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని కోరారు.

## పోస్టల్ శాఖ సేవలు విస్తృతం

- ఒయు విసి రవీందర్
- పోస్టల్ ఉద్యోగులకు రీజినల్ లెవెల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రదానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పోస్టల్ శాఖ విస్తృతమైన సేవలు అందిస్తోందని ఒయు విసి రవీందర్ అన్నారు. తెలంగాణ పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రీజినల్ లెవెల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్ ఒయు క్యాంపస్‌లోని జామై ఉస్మానియా పోస్ట్ ఆఫీస్ ఆవరణలో నిర్వహించారు. బాధ్యతలో ప్రతిభ చూపి, విధులు సక్రమంగా నిర్వహించి, పోస్టల్ డిపార్ట్‌మెంట్ సేవలు అందించడంలో ముందంజలో ఉన్న రాష్ట్ర వ్యాప్త పోస్టల్ ఉద్యోగులకు ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఒయు విసి మాట్లాడుతూ.. ప్రతి పోస్ట్ ఆఫీసు దాదాపుగా 250 సేవలు అందిస్తోందన్నారు. కస్టమర్లు పోస్ట్ ఆఫీసుకు రాకుండా పోస్ట్‌మ్యాన్ లేదా జిడిఎస్ ద్వారా ఇంటి వద్దనే 160 సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ సర్వీస్‌లను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె ప్రకాష్ మాట్లాడుతూ.. పోస్టల్ శాఖ సేవలకు హైదరాబాద్ నగరం, జిల్లాలు, గ్రామాల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన 31 మందికి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ సాయి పల్లవి, జనరల్ పోస్ట్ మాస్టర్ హెచ్ఆర్ విద్యాసాగర్, కెఎ దేవరాజ్, డిటిఎస్, ఉద్యోగులు పాల్గొన్నారు

## దిలీప్ కొణతంకు సోషల్ మీడియా పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ డిజిటల్ మీడియా విభాగం డైరెక్టర్ దిలీప్ కొణతం పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిఆర్‌సిఐ) "సోషల్ మీడియా పర్సన్ ఆఫ్ ది ఇయర్" అవార్డును అందుకున్నారు. న్యూఢిల్లీలో గురు, శుక్రవారాల్లో పిఆర్‌సిఐ నిర్వహించిన 17వ గ్లోబల్ కమ్యూనికేషన్ కాంక్లేవ్‌లో కేంద్ర మాజీ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ అవార్డును అందజేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సామాజిక మాధ్యమాల్లో సేవలందించిన వ్యక్తులకు పిఆర్‌సిఐ ఈ అవార్డులను ఇస్తున్న సంగతి తెలిసిందే. 2023 సంవత్సరానికిగాను సోషల్ మీడియా ఉత్తమ వినియోగం అవార్డు, ఉత్తమ వార్షిక నివేదిక అవార్డు (తెలంగాణ ఐటీ శాఖ వార్షిక నివేదిక 2022-23కి), ప్రజా సేవల ప్రకటనల అవార్డు ("మన ట్యాంక్‌బండ్‌ని శుభ్రంగా, అందంగా ఉంచుకుందాం" వీడియోకి), ఉత్తమ ప్రభుత్వ కమ్యూనికేషన్ ఫిల్మ్ ("కాళేశ్వరం – తెలంగాణ జల విప్లవం" వీడియోకి) అవార్డులొచ్చాయి. తెలంగాణ డిజిటల్ మీడియా విభాగం సహాయ సంచాలకులు ముడుంబై మాధవ్, డిజిటల్ మీడియా కన్సల్టెంట్ నరేందర్ గుర్రెడ్డి అవార్డులు అందుకున్నారుదిలీప్ కొణతంకు సోషల్ మీడియా పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

# ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు
- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ 'ఫీజు దీక్ష'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'ఫీజు దీక్ష' చేపట్టారు. అందులో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఇసిఐఎల్ అంబేద్కర్ చౌరస్తాలో ఫీజు దీక్షను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాథోడ్ సంతోష్ ప్రారంభించారు. అనంతరం దీక్ష ముగింపులో నాగరాజు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ.5,177 కోట్లను ప్రభుత్వం ఇప్పటి వరకు విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నాలుగు డిమాండ్లపై రాష్ట్ర వ్యాప్తంగా ఫీజుల దీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. బడుగు బలహీన తరగతుల విద్యార్థుల కోసం అడిగింది ఇస్తామని చెప్పి కెసిఆర్ సర్కార్ మోసం చేసిందన్నారు. చదువు పూర్తయినా విద్యార్థుల సర్టిఫికెట్లను కార్పొరేట్, ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు ఇవ్వడం లేదని, ఫీజు డబ్బులు మొత్తం చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల్లో సర్టిఫికెట్లను వెంటనే విద్యార్థులకు ఇచ్చేటట్టు జిఒ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులను దీక్ష విరమింపజేశారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పరాల నరేష్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎర్ర అశోక్, జె.చంద్రశేఖర్ ఫీజు దీక్షకు సంఘీభావం తెలియజేశారు. ఫీజుల దీక్షకు దాదాపు పది కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, అరుణ్, నాయకులు భగత్, కార్తిక్, శివ, శ్యామ్, అనిల్, శివ, భాస్కర్, రామ్ చరణ్ పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఫీజు దీక్షలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాయికాడి శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.5,177 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. వీరి దీక్షకు డీవైఎఫ్ఐ, ఎంఆర్‌పిఎస్ సంఘాలు మద్దతు తెలిపాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు. ఈ దీక్షకు పిడిఎస్‌యు నాయకులు మారుతీ, సీతారాం, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు సురేష్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మోహన్ మద్దతు తెలిపారు.

ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్ ఎదుట టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుదేవరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ఆధ్వర్యంలో ఫీజు దీక్ష ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు రత్నం రాజేందర్ మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా స్కాలర్‌షిప్ పెంచాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, నాయకులు సునీల్ సంఘీభావం తెలిపారు. హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కాలేజీ వద్ద, జనగామ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఫీజు దీక్ష చేపట్టారు.

## అక్కినేని జీవితం ఆదర్శప్రాయం

ప్రజాశక్తి - కల్చరల్

సినీ కళాకారులకే కాక యువతకు అక్కినేని జీవితం ఆదర్శ ప్రాయమని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ అన్నారు. శారీరకంగా ఎన్ని లోపాలు ఉన్నా స్వీయ లోపంబు లెరుగుట పెద్ద విద్య అని తెలుసుకొని ఎదిగిన మహా వ్యక్తి అక్కినేని అన్నారు. శ్రీ త్యాగరాయ. గాన సభ ప్రధాన వేదిక పై జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా వివిధ రంగ ప్రముఖులకు నగదు పురస్కార ప్రధాన సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని సాంస్కృతిక రంగం నుంచి ధర్మారావు, సినీ రంగం నుంచి సుబ్బరాయ శర్మ, రంగస్థలం నుంచి జ్యోతిరాజ్ భీసెట్టి, నాట్య రంగం నుంచి వనజా ఉదయ్, సంగీత రంగం నుంచి డాక్టర్ అర్ శ్రీకాంత్‌లను సత్కరించి మాట్లాడారు. అక్కినేని జీవించినంత కాలం నటిస్తూనే ఉన్నారని ప్రపంచ సినీ చరిత్రలో అరుదైన నటుడు అని అన్నారు. కళా పోషకుడు చిల్ల రాజశేఖర రెడ్డి అధ్యక్షవహిచున సభలో లంక లక్ష్మీనారాయణ, రామరాజు శ్రీనివాస రావు గిడుగు కాంతి కృష్ణ తదితరులు ఉన్నారు. కార్యక్రమానికి తొలుత లక్ష్మి శ్రీనివాస్‌చే వీణా వాదన హృద్యంగా జరిగింది.

## ఆప్‌తోనే ఉచిత విద్య, వైద్యం

- తెలంగాణలోనూ ఢిల్లీ మోడల్
- 24న సామాన్యుడి సమరభేరీ : సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఉచిత విద్య, వైద్యమందిస్తామని, తెలంగాణలోనూ ఢిల్లీ తరహా పాలనను తీసుకొస్తామని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన సెప్టెంబర్ 24న హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని ఆర్‌టిసి కల్యాణ మండపంలో నిర్వహించనున్న సామాన్యుడి సమరభేరీ సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆ సదస్సుకు ఆప్ దక్షిణ భారత ఇన్ ఛార్జి సోమనాథ్ భారతి హాజరవుతారనీ, 33 జిల్లాల నుంచి జిల్లా కన్వీనర్లు, మండల, గ్రామ కన్వీనర్లు పాల్గొంటారని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వ్యవసాయ కష్టాలు, విద్య, ఆరోగ్యం, అవినీతి, పేపర్ లీకేజీలతో సహా పలు కీలక సమస్యలను చర్చించనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, బిజెపి విభజన రాజకీయాలు, బిఆర్ఎస్ అవినీతి రాజకీయాలను ప్రజలకు వివరించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. వన్ నేషన్, వన్ ఎడ్యుకేషన్, వన్ హెల్త్‌కేర్ వంటి ఆప్ ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. మెరుగైన జీవితం అందించగల పార్టీ ఆప్ అని గుర్తించిన ప్రజలు వివిధ రాష్ట్రాల్లో అద్భుతమైన విజయాలు అందిస్తున్నారనీ, అదే విధంగా తెలంగాణలోనూ ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ అధికార ప్రతినిధి వినయ్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సోహెల్, నేతలు టి రాకేష్ సింగ్, జావేద్ షరీఫ్, శ్రీనివాస్ రెడ్డి, ముత్తాహేయిడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు నెలల కనిష్టానికి విదేశీ మారకం నిల్వలు

ముంబయి : వరుసగా రెండో వారంలోనూ భారత విదేశీ మారకం నిల్వలు పడిపోయాయి. సెప్టెంబర్15తో ముగిసిన వారంలో 860 మిలియన్ డాలర్లు కరిగిపోయి 593.037 బిలియన్లుగా నమోదయ్యాయయని రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ఇంతక్రితం వారంలో ఏకంగా 4.99 బిలియన్ డాలర్లు క్షీణించాయి. రూపాయి క్షీణతను అడ్డుకునేందుకు డాలర్లను విక్రయించడంతో నిల్వలు తగ్గాయని ఫారెక్స్ నిపుణులు అంచనా వేస్తున్నారు. 2021 అక్టోబర్‌లో భారత విదేశీ మారకం నిల్వలు 645 బిలియన్ డాలర్లకు చేరి ఆల్‌టైం గరిష్ట స్థాయిని నమోదు చేశాయి.

## రేణిగుంటలో ఆటోమోటివ్ సర్వీసు సెంటర్ ఏర్పాటు

**తిరుపతి :** ఆటోమోటివ్ మాన్యుఫాక్చరర్స్ సంస్థ రేణిగుంటలో తన అత్యాధునిక సర్వీసు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు తెలిపింది. అశోక్ లేలాండ్ సంస్థకు సంబంధించిన అతి పెద్ద డీలర్లలో ఆటోమోటివ్ ఒకటి. ఈ ప్రాంతంలోని వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడంలో తన నిబద్ధతను కొనసాగించనున్నట్లు ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ సంఘ్వి తెలిపారు. ఈ ప్రాంతంలో అతిపెద్ద వాణిజ్య వాహనాల వర్క్ షాప్ తమదేనని పేర్కొన్నారు. దీంతో 104 సర్వీసు టచ్ పాయింట్లకు నెట్‌వర్క్‌ను విస్తరించినట్లయ్యిందన్నారు.

## లక్స్ ఇండస్ట్రీస్ రూ.200 కోట్ల పన్ను ఎగవేత..!

- 3 శాతం పడిపోయిన షేర్ విలువ

**కోల్‌కత్తా :** లోదుస్తుల కంపెనీ లక్స్ ఇండస్ట్రీస్ రూ.200 కోట్ల పన్ను ఎగవేసినట్లు ఆదాయపు పన్ను శాఖ అరోపించింది. ఆ సంస్థ కోల్‌కత్తా కార్యాలయం సహా సంబంధిత ఇతర నగరాల్లోని స్థలాల్లోనూ ఐటి అధికారులు తనిఖీలు చేశారు. ఈ వార్తలు బయటికి రావడంతో ఆ కంపెనీ షేర్ 3.19 శాతం పతనమై రూ.1,470.9కి పడిపోయింది. విచారణలో అధికారులకు సహకరిస్తామని లక్స్ ఇండస్ట్రీస్ తెలిపింది.

## కెనడాలో మహీంద్రా అనుబంధ సంస్థ మూత

**న్యూఢిల్లీ :** కెనడాలోని మహీంద్రా అండ్ మహీంద్రా అనుబంధ సంస్థ రెస్సన్ ఏరోస్పేస్ కార్పొరేషన్ కార్యకలాపాలను స్వచ్ఛందంగా రద్దు చేసుకుంది. తమ సంస్థను మూసివేస్తున్నట్లు ఆ సంస్థ కెనడా కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకోగా.. సెప్టెంబర్ 20న ఆమోదం లభించింది. ఈ విషయాన్ని ఎంఅండ్ఎం గురువారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ప్రకటించింది. దీంతో శుక్రవారం ఎంఅండ్ఎం షేర్లు 3 శాతం పతనమై రూ.1583.80 వద్ద ముగిసింది. సంస్థ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.7200 కోట్లు ఆవిరయ్యింది. ఎంఅండ్ఎంకు రెస్సన్‌లో 11.18 శాతం వాటాలున్నాయి. మూసివేతకు గల కారణాలను మాత్రం ఎంఅండ్ఎం వెల్లడించకపోవడం గమనార్హం.

## కొత్త పార్లమెంట్‌కు సిగ్నిఫై లైటింగ్ సొల్యూషన్స్

న్యూఢిల్లీ : ప్రముఖ లైటింగ్ ఉత్పత్తుల కంపెనీ సిగ్నిఫై కొత్త పార్లమెంట్‌కు పలు లైటింగ్ సొల్యూషన్స్ అందించినట్లు తెలిపింది. టాటా ప్రాజెక్ట్స్‌తో కలిసి ఇపిసి ప్రాతిపదికన ప్రధాన కాంట్రాక్టర్లుగా వ్యవహరించినట్లు పేర్కొంది. కొత్త భవనానికి 1200 కన్నా ఎక్కువ ఫిలిప్స్ లూమినైర్‌లను ఉపయోగించినట్లు తెలిపింది. మమూత్ త్రిభుజాకార భవనంలోని అశోక్ స్తంభం, బాహ్య, అంతర్గత ముఖభాగాలు వంటి అనేక ప్రముఖ విభాగాలను ప్రకాశవంతం చేసినట్లు పేర్కొంది. లోక్‌సభ, రాజ్యసభల ప్రధాన ఫంక్షనల్ ఇంటీరియర్ లైటింగ్‌ను కూడా తామే చేపట్టామని సిగ్నిఫై దక్షిణాసియా సిఇఒ సుమిత్ జోషి తెలిపారు.